సాక్షి నిర్మల్
సోమవారం ၊ 9 ၊ జనవరి ၊ 2023



న్యూస్‌రీల్

బాలుడి వైద్యానికి చేయూత

- సాక్షి కథనానికి స్పందించిన దాతలు



ఆస్పత్రిలో బాలుడితో జాన్సన్‌నాయక్

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కావేటి శివ–శిరీష దంపతుల కుమారుడు గుండె సమస్యతో బాధపడుతుండగా 'మా కుమారున్ని ఆదుకోండి' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ మిత్రుడు జాన్సన్‌నాయక్ హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి వైద్యఖర్చుల కింద రూ.88వేలు చెల్లించి దగ్గరుండి డిశ్చార్జి చేయించారు. అలాగే మంత్రి ఐకే రెడ్డి వ్యక్తిగత సహాయకుడు, ఖానాపూర్ నివాసి కృష్ణంరాజు ఆసుపత్రికి చెల్లించాల్సిన బిల్లు నుంచి రూ.50వేలు డిస్కౌంట్ చేయించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. పుష్కర్ల సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు దాతల తోపాటు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తానూర్ మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న గోపీనాథ్, జయశ్రీ దంపతులను ఆదివారం పంచాయతీరాజ్ అధికారులు పరామర్శించారు. రూ.66వేలు వారికి ఆర్థికసాయంగా అందజేశారు.

రచనలకు ఆహ్వానం

నిర్మల్ టౌన్: తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా సమగ్ర సర్వస్వానికి వివిధ అంశాలపై రచనలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ తుమ్మల దేవరావ్, కో కన్వీనర్లు దామెర రాములు, చక్రధారి, నేరెళ్ల హన్మంతు ఓ ప్రకటనలో తెలిపారు. చరిత్ర, సంస్కృతి, కళలు, భౌగోళిక పరిస్థితులపై రచనలు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య పరిషత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ బృహత్ కార్యంలో ఆసక్తి గల రచయితలు పాల్గొనాలని కోరారు. వివరాలకు కన్వీనర్ తుమ్మల దేవరావ్‌ను, 8985742274, 9849247244 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని నాయుడువాడలోగల చాత్తాద శ్రీవైష్ణవ సంఘ భవనంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం గోదాదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పారాయణం చేపట్టారు. జిల్లా గౌరవాధ్యక్షుడు దాస్యం లింబగిరి స్వామి తన దివ్య వచనాలతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవాధ్యక్షుడు తిరుక్కోవెల నారాయణస్వామి, జిల్లా అధ్యక్షుడు వకుళాభరణం మధుసూదన్, జిల్లా గౌరవ సలహాదారు రఘువీరపాణి, డివిజన్ గౌరవ సలహాదారు తిరునగరి లక్ష్మణస్వామి, జిల్లా కోశాధికారి ధర్మగద్ద రఘునాథ, డివిజన్ కోశాధికారి తిరుక్కోవెల సుదర్శన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి అనంతశనం మనోహర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొలువుల కోలాహలం!

- వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- పుస్తకాలతో నిరుద్యోగుల కుస్తీ
- గ్రూప్స్ ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి
- కిటకిటలాడుతున్న కోచింగ్ సెంటర్లు



జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగ యువత

నిర్మల్‌చైన్‌గేట్: ఏళ్ల తరబడి ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసిన నిరుద్యోగుల్లో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాల కోసం వరుస నోటిఫికేషన్లు విడుదల చేస్తుండగా కొలువుల సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. కోచింగ్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలతోపాటు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కథనం..

వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి..

విద్య, వైద్య, పోలీస్, రెవెన్యూ, సంక్షేమ తదితర శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి టీఎస్ పీఎస్సీతో పాటు ఇతర శాఖలు సొంతంగా నోటిఫికేషన్లు జారీ చేశాయి. ప్రధానంగా ఉపాధ్యాయ, పోలీస్, గ్రూప్స్ వంటి ఉద్యోగాలపై నిరుద్యోగ యువకులు గంపెడాశలు పెట్టుకొని చదువుతున్నారు. పోలీస్‌శాఖలో ఇప్పటికే ఈవెంట్స్ ప్రక్రియ పూర్తి కాగా మెయిన్స్ రాత పరీక్షల్లో రాణించేందుకు అభ్యర్థులు సంసిద్ధులవుతున్నారు. ప్రస్తుతం గ్రూప్–4, గ్రూప్–2తోపాటు జేఎల్, స్టాఫ్‌నర్స్ తదితర పోస్టులకు అర్హులు సిద్ధమవుతున్నారు.

గ్రూప్–4, 3పైనే దృష్టి..

నిరుద్యోగులు ఎక్కువగా డీఎస్సీతో పాటు జేఎల్, వార్డెన్, లైబ్రేరియన్ తదితర పోస్టులు, పోలీస్ ఉద్యోగాల నియామకాలపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం తరచూ ఈ రెండు శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. ఈసారి గ్రూప్–2, 3, 4 పోస్టులను భర్తీ చేయనుంది. వీటి ఖాళీల సంఖ్య ఎక్కువగా ఉండగా నిరుద్యోగులు ఎక్కువ వీటి పైనే దృష్టి సారిస్తున్నారు. వీటితో పాటు రెవెన్యూ, ఆర్టీఏ, వైద్య, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్, హార్టికల్చర్, అగ్రికల్చర్, డ్రగ్ కంట్రోలర్ తదితర శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చింది. దీంతో ఏదో ఒక దాంట్లో ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో నిరుద్యోగులు శ్రమిస్తున్నారు.

అభ్యర్థుల్లో గందరగోళం

ప్రభుత్వం అన్ని శాఖల నుంచి ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేస్తుండగా నిరుద్యోగులు గందరగోళానికి గురవుతున్నారు. జోనల్ స్థాయిలో ఉండే జేఎల్ తదితర పోస్టుల కోసం ఎదురుచూసేవారు ఇబ్బంది పడుతున్నారు. గ్రూప్స్ నోటిఫికేషన్లు కూడా ఇప్పుడే రావడంతో ఏ పరీక్షకు సిద్ధం కావాలనే సంశయంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్ (జూనియర్ పంచాయతీ సెక్రటరీ) పోస్టుల నియామకానికి 2018 సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చింది. అంతకుముందు వీఆర్వో, గ్రూప్–4, 2016లో డీఎస్సీ నోటిఫికేషన్లు వచ్చాయి. 2018 తర్వాత పెద్దగా నోటిఫికేషన్లు రాలేదు. మూడేళ్ల తర్వాత అన్నీ శాఖల నుంచి నోటిఫికేషన్లు వస్తుండగా గందరగోళానికి దారి తీస్తోంది. ఏ ఉద్యోగానికి సిద్ధం కావాలనేది అభ్యర్థులు తేల్చుకోలేకపోతున్నారు. ముందుగా శిక్షణ తీసుకుంటే ఏదోఒకటి సాధించలేక పోతామా.. అనే ఉద్దేశంతో మళ్లీ కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు.

సందడిగా గ్రంథాలయాలు

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య సుమారు 4,350గా ఉంది. క్షేత్రస్థాయిలో మాత్రం అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. వరుస నోటిఫికేషన్లు రావడంతో కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. కొందరు గ్రంథాలయాలను ఆశ్రయిస్తుండగా, మరికొందరు ఇంటి వద్దే చదువుకుంటున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ప్రాంతీయ గ్రంథాలయాల్లో చదువుకునే వారితో పాటు, శిక్షణ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయానికి ప్రతిరోజూ 400 నుంచి 500 మంది వస్తున్నారు. ప్రాంతీయ గ్రంథాలయాల్లో 200 మంది ప్రిపేరవుతున్నారు. అనేకమంది ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్నారు. ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలని రాత్రింబగళ్లు కష్టపడి చదువుతున్నారు.

డీఎస్సీ కోసం నిరీక్షణ

జిల్లాకు 2,958 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా 2,435 పోస్టులు భర్తీ చేశారు. మరో 523 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో పాత, కొత్త వారితో కలిపి 10వేల మంది అర్హులు పోటీలో ఉన్నారు. వీరంతా డీఎస్సీ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు.

గందరగోళంగా ఉంది



నోటిఫికేషన్లు వెంటవెంటనే రావడంతో దేనికి సిద్ధం కావాలో గందరగోళంగా ఉంది. ఒక్కో ఉద్యోగానికి ఒక్కో రకమైన సిలబస్ ఉంటుంది. శిక్షణ కూడా దేనికి తీసుకోవాలో అర్థం కావడంలేదు. ఒక్కో నోటిఫికేషన్‌కు కనీసం ఆర్నెళ్ల సమయం ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తే బాగుండేది.

– రవి, పెంబి

నియామకాల్లో జాప్యం వద్దు



చాలారోజులుగా నోటిఫికేషన్ల కోసం నిరీక్షిస్తున్నాం. ప్రభుత్వం నోటిఫికేషన్లు వేసిన వెంటనే నియామక ప్రక్రియ పూర్తిచేయాలి. ఒకేసారి ఎక్కువ నోటిఫికేషన్లు రావడంతో దేనికి ప్రిపేర్ కావాలో అర్థం కావడంలేదు. నేను ఎస్సైకి క్వాలిఫై అయి ఇపుడు గ్రూప్–4కు ప్రిపేర్ అవుతున్నా.

– శ్రావణ్, నిర్మల్

ఇదే మంచి అవకాశం



నేను గ్రూప్–2 ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నా. గతంలో కూడా గ్రూప్–2 పరీక్ష రాశాను. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలని కష్టపడి చదువుతున్నాను. ప్రభుత్వం ఒకేసారి ఎక్కువ నోటిఫికేషన్లు విడుదల చేయడంతో చదువుపైనే దృష్టి పెట్టాను. నిరుద్యోగులకు ఇదే మంచి అవకాశం.

– దేవేందర్, సోన్

ప్రయోగం... నామమాత్రం

- మూడేళ్లుగా మంజూరు కాని నిధులు
- సైన్స్‌ల్యాబ్‌ల్లో అన్నీ పాత పరికరాలే
- అంతటా నిండుకున్న రసాయనాలు
- విద్యార్థులకు అందని 'శాస్త్ర' పరిజ్ఞానం

నిర్మల్‌చైన్‌గేట్: విద్యార్థి జీవితంలో పదో తరగతి తర్వాత ఇంటర్ విద్యే కీలకం. ఇక్కడ వేసే అడుగు భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది. మూడేళ్లుగా ప్రభుత్వం నయాపైసా విడుదల చేయకపోవడంతో పరికరాలు లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగాలు అటకెక్కాయి. ప్రయోగశాలల నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. తరగతులకు అవసరమైన పరికరాలను నాలుగైదేళ్లుగా కొనడం లేదు. ప్రయోగాల నిర్వహణకు కరోనా కాలం నుంచి నిధులు మంజూరు కావడం లేదు. ఫలితంగా సైన్స్ విద్యార్థులకు మొక్కుబడిగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇది వారి భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

12 కళాశాలలో 5,564 మంది..

జిల్లాలో మొత్తం 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. ప్రథమ సంవత్సరంలో 2,650 మంది, రెండో సంవత్సరంలో 2,914 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రధానంగా భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి ప్రయోగాలు తప్పనిసరి. ఇందుకుగానూ ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారు. కాగా, ఈ పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణకు రసాయనాలు, ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో గతంలో కొనుగోలు చేసిన రసాయనాలతోనే ల్యాబ్ తరగతులు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన రసాయనాలతో సరైన ఫలితాలు వచ్చే అవకాశం లేదు. ప్రతీ కళాశాలకు ప్రాక్టికల్స్ నిమిత్తం రసాయనాల కొనుగోలుకు ఏటా రూ.30 వేలు ఖర్చవుతోంది. ఫిబ్రవరి 15 నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతుండగా.. ఇంతవరకు నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

ప్రాక్టికల్సే కీలకం..

ఇంటర్ ఎంపీసీ, బైపీసీ అంటేనే ప్రయోగాల కోర్సులు. రెండేళ్ల చదువు పూర్తిచేసే లోపు భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రయోగశాలకు వెళ్లి నేర్చుకోవాల్సి ఉంటుంది. పలువురు విద్యార్థులకు పిప్పెట్, బ్యూరెట్, ఘటం, ఆమ్లం, క్షారం, లవణం, వెర్నియర్ కాలిపస్, స్క్రూగేజీ, లఘు లోలకం, అయస్కాంతం రకాలు, విద్యుత్ ప్రవాహం అంటే తెలియని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి



కాదు. అదేవిధంగా ఏకదళ బీజం, ద్విదళ బీజం, కేసరాలు, అండాశయం, అంతర్ నిర్మాణాల గురించి అస్సలు తెలియని వారు కూడా ఉన్నారు. జువాలజీకి సంబంధించి డిటెక్షన్ అంటే తెలియదు. స్పెసిమిన్, స్లైడ్స్ గురించి అవగాహన లేనివారు ఉన్నట్లు పలువురు అధ్యాపకులే చెబుతుండడం విశేషం. ఫలితంగా ప్రైవేట్ కళాశాలలతో పోల్చుకుంటే మెరుగ్గా రాణించలేకపోతున్నారు. దీంతో ఉత్తీర్ణత శాతం తగ్గే అవకాశముంది.

ఫలితాలు తారుమారు



ప్రభుత్వం నుంచి రసాయనాల కొనుగోలు నిమిత్తం నిధులు మంజూరు కాకపోవడంతో గతంలో కొనుగోలు చేసిన రసాయనాలతోనే ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నాం. దీంతో సరైన ఫలితాలు రావడం లేదు. ల్యాబ్‌లో కనీసం వేయింగ్ మిషన్ కూడా అందుబాటులో లేదు.

– ప్రవల్లిక, కెమిస్ట్రీ లెక్చరర్

పరికరాలు అందజేయాలి



ప్రాక్టికల్స్ పరీక్షలు సమీపిస్తున్నా ఇప్పటివరకు ల్యాబ్‌లో రసాయనాలు, ఇతర పరికరాలు అందుబాటులో లేవు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఇవి మంజూరైతే ప్రాక్టికల్స్ విషయమై మాకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంటుంది. పరికరాలు అందజేయాలి.

– ప్రియాంక, బైపీసీ సెకండ్ ఇయర్

నిధులు మంజూరు కాలేదు



ప్రాక్టికల్స్ సమీపిస్తున్నా ఈ ఏడాది ఇంతవరకు రసాయనాల కొనుగోలు నిమిత్తం నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆందోళన చెందుతున్నాం. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉన్న రసాయనాలతో ప్రయోగాలు చేయిస్తున్నాం. – రవికిరణ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాయ్స్ జూనియర్ కళాశాల, నిర్మల్

ప్రతిపాదనలు పంపాం



ప్రాక్టికల్స్ పరీక్షల నిమిత్తం రసాయనాలు, ఇతర పరికరాలు కొనుగోలు చేసేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలకు నిధులు మంజూరు అయ్యే అవకాశాలున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– పరశురాం, ఇంటర్ జిల్లా విద్యాధికారి

భరతమాత ముద్దుబిడ్డలు

వారంతా భరతమాత ముద్దు బిడ్డలే. బతుకు దెరువు కోసం కొందరు.. ఉన్నత విద్యాభ్యాసం కోసం మరికొందరు.. వ్యాపారం కోసం ఇంకొందరు విదేశీబాట పట్టారు. అక్కడే స్థిరపడ్డారు. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని' అని నినదించిన కవి రాయప్రోలు సుబ్బారావు మాటలను అక్షరాలా నిజం చేస్తున్నారు. మన జాతి గౌరవాన్ని నిలబెడుతున్నారు. ఏ దేశంలో స్థిరపడినా.. ఏ వృత్తిలో ఉన్నా.. పుట్టిన గడ్డపై మమకారం చాటుతున్నారు. తాము సంపాదించిన దాంట్లో కొంత తమ ఉన్నతికి కారణమైన సొంతూరు అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. సర్కారు బడికి చేయూతనిస్తూ.. పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. సోమవారం ప్రవాసీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఎన్నారైలు అందిస్తున్న సహకారంపై ప్రత్యేక కథనం.

- వివరాలు 8లో ▸

అడెల్లి.. భక్తజన సందడి



ఆలయ ఆవరణలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన వరంగల్, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ ఔట్‌పోస్టు, ఆలయ పరిసరాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోగొట్టుకున్న చెవికమ్మ అప్పగింత

అడెల్లి మహాపోచమ్మ దర్శనానికి వచ్చిన జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన భక్తురాలు యాసాని తిమ్మవ్వ తన బంగారు చెవికమ్మ పోగొట్టుకుంది. విషయం తెలుసుకున్న చైర్మన్ ఆయిటి చందు వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారితో ఆలయ పరిసరాల్లో వెతికించారు. చెవికమ్మ లభ్యం కావడంతో తిమ్మవ్వకు అప్పగించారు. ఈ సందర్భంగా చైర్మన్ చందు, ఆలయ సిబ్బందికి తిమ్మవ్వ కృతజ్ఞతలు తెలిపింది.



దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

'విద్యతోనే సమాజాభివృద్ధి'

భైంసాటౌన్: విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలో రెండో కౌండిన్య కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన గౌడ విద్యార్థులకు హైదరాబాద్‌లోని గౌడ హాస్టల్‌లో 15శాతం సీట్లు, వసతి కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి'



సమావేశంలో మాట్లాడుతున్న రేఖానాయక్

ఖానాపూర్: బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. పార్టీ విస్తరణలో భాగంగా ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ మండలం జరూర్ గ్రామంలో ఆమె పర్యటించారు. బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే తెలంగాణలోని పథకాలన్నీ దేశవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.



పిచ్చి మొక్కలతో కళావిహీనంగా దివ్యనగర్ పార్క్



గడ్డి పెరిగి కనిపించని వాకింగ్ ట్రాక్



విరిగి నిరుపయోగంగా కర్ర వంతెన



మురుగునీరు, చెత్తాచెదారంతో పాంటెయిన్

ఆహ్లాదం.. బహుదూరం

జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పార్క్ నిర్వహణ లేక కళావిహీనమైంది. ఆవరణంతా గడ్డి, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండి అపరిశుభ్రంగా మారింది. వాకింగ్ ట్రాక్‌పై నీళ్లు నిలిచి బురదతో నిండింది. పిల్లలు ఆడుకునే పరికరాలు విరిగి నిరుపయోగమయ్యాయి. నిత్యం ఉదయం, సాయంత్రం వాకింగ్, జాగింగ్, వ్యాయామం కోసం వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. వెంటనే పార్క్‌ను వినియోగంలోకి తేవాలని పట్టణవాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా

దాడి కేసులో ఒకరి రిమాండ్

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన ఉట్ల రాజలింగంపై అదే గ్రామానికి చెందిన వాహీద్ దాడిచేసిన విషయం విధితమే. అయితే సదరు వ్యక్తిపై బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం సారంగపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని వాహీద్‌ను రిమాండ్‌కు తరలించారు. వ్యక్తిగత కారణాలతోనే వాహిద్ రాజలింగంపై దాడిచేసినట్లు విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు.

మాంజా దారంతో గాయం


గాయం చూపిస్తున్న తుమ్మ వెంకటేశ్

కుంటాల : మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన తుమ్మ వెంకటేశ్ మాంజా దారంతో గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటేశ్ ఆదివారం వ్యవసాయ పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. వచ్చే దారిలో గాలిపటం చిక్కుకుని దానికున్న దారం వేలాడుతుంది. ఆ దారం కంటికి కనిపించకపోవడంతో ఆయన గొంతుకు గాయమైంది. దీంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గాలిపటాలు ఎగురవేసే పిల్లలు చైనా మాంజా దారం వాడొద్దని స్థానిక వైద్యులు శృతిరెడ్డి సూచించారు.

విహారయాత్రకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, నలుగురికి గాయాలు


అభిలాష్(ఫైల్)

భైంసాటౌన్: కారులో విహారయాత్రకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యు ఒడికి చేరుకోగా, మరో నలుగురు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. భైంసా పట్టణానికి చెందిన మోరె అభిలాష్(23) తన స్నేహితులు డి.రాజు, బి.రాజు, సాయినాథ్, విశాల్‌తో కలిసి మహారాష్ట్రలో తీర్థ స్థలాలు దర్శించుకునేందుకు విహారయాత్రగా శనివారం సాయంత్రం కారులో బయల్దేరారు. కాగా, ఆదివారం వేకువజామున తుల్జాపూర్ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో కారు నడుపుతున్న అభిలాష్ అక్కడికక్కడే మృతి చెందగా, కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

చోరీకి యత్నించిన ఒకరి రిమాండ్

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో హుండీ పగులగొట్టి చోరీకి యత్నించిన ఒకరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అజయ్‌బాబు తెలిపారు. ఆదివారం విలేకరులతో సీఐ మాట్లాడుతూ చోరీ విషయమై గ్రామస్తుల నుంచి అందిన సమాచారం మేరకు అరెస్టు చేశామన్నారు. ఎస్సై శంకర్ ఉన్నారు.

ఒకరిపై ఐదుగురి దాడి

ఆదిలాబాద్‌టౌన్: ఓ వ్యక్తిపై ఐదుగురు దాడి చేసిన ఘటన శనివారం రాత్రి ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై ఊశన్న కథనం ప్రకారం.. ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన మస్కే కృష్ణ మార్కెట్ ప్రాంతం నుంచి రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. అదే కాలనీకి చెందిన శ్రీను, శ్రీకాంత్, చింటు, శివ, దినేష్ అనే యువకులు కృష్ణను ఆగాలని చెప్పారు. ఆకలిగా ఉందని, త్వరగా ఇంటికి వెళ్లాలని చెప్పి ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆగ్రహానికి గురైన సదరు యువకులు ఆయనపై దాడికి దిగారు. మేము చెప్పిన తర్వాత ఆగకుండా మా గల్లీ నుంచి ఎలా వెళ్తావని శ్రీను రాడ్‌తో కృష్ణ నుదిటిపై కొట్టడంతో రక్తస్రావమైంది. బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మాతృభూమిపై మమకారంతో..

- ఎన్‌ఆర్‌ఐల ఔదార్యం... ● పాఠశాలల అభివృద్ధికి కృషి..
- గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకుంటూ ● ఆదర్శంగా సేవలు ● నేడు ప్రవాసీ దినోత్సవం

ఎక్కడ ఉన్న... ఏమి చేసిన మాతృభూమిని మరిచిపోలేం. తల్లిలాంటి ఊరుకు ఏదో ఓటి చేయాలనిపిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇతర దేశాల్లో స్థిరపడిన పలువురు ఉన్న ఊరు కోసం తమ చేతనైనా సాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారు సంపాదించిన దాంట్లో కొంత స్వగ్రామం కోసం ఖర్చు చేస్తున్నారు. ఇందులో కొందరు పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడుతుండగా మరికొందరు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మరికొందరు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు సాయం చేస్తూ ముందుకు సాగుతున్న వారి గురించి ప్రవాసీ దివాస్ సందర్భంగా ప్రత్యేక కథనం...

చదువు కోసం..


విరాళం అందిస్తున్న మనోహర్-సరోజ దంపతులు(ఫైల్)


ప్రశాంత్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, అమెరికా

మామడ: మామడ మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన పరికిపండ్ల మనోహర్ సరోజల కుమారుడు పరికిపండ్ల ప్రశాంత్ ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఏడేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడే ఉన్నత విద్య పూర్తి చేసిన అనంతరం ఆమెరికాలోనే స్థిరపడ్డాడు. చికాగో రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ రంగంలోకి ప్రవేశించి స్వంతగా వ్యాపారం ప్రారంభించి ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు.

పాఠశాలపై ఔదార్యం...
ప్రశాంత్ స్వగ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో దాదాపు 600మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ల్యాబ్ సౌకర్యం కోసం రూ.1.20లక్షలు విరాళంగా తన తల్లిదండ్రుల ద్వారా అందించాడు.

చదువునేర్పిన గురువుపై మమకారంతో...
ఎన్ఆర్ఐ పరికిపండ్ల ప్రశాంత్ తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై అభిమానంతో గురువు పనిచేస్తున్న పాఠశాలకు రూ.లక్ష విరాళం అందించి తన ఔదర్యం చాటుకున్నాడు. తనకు పాఠశాల స్థాయిలో విద్యను అందించిన గురువు ఉమేష్‌రావ్ ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నట్లు తెలుసుకుని ఆ పాఠశాల అభివృద్ధి కోసం తనవంతుగా సాయం అందించాడు.

పుట్టిన ఊరు రుణం తీర్చుకున్న నందుకుమార్


శివాజీ విగ్రహం


చట్ల నందుకుమార్

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ చట్ల లింగన్న చిన్న కుమారుడు చట్ల నందుకుమార్ 20ఏళ్లుగా కుటుంబంతో కలిసి అమెరికాలోని అట్లాంటాలో ఉంటున్నారు. తన స్వ గ్రామానికి ఏదైన చేయాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రూ.5 లక్షలతో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయించాడు. శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.5 లక్షలతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నాడు. మహదేవుని మందిరం ఆవరణలో రూ.2 లక్షలతో రెండు గదులు నిర్మించాడు.

కష్టాల్లోంచి గట్టెక్కి.. అమెరికాలో స్థిరపడి


మంచిర్యాలలో ట్రైసైకిళ్లు అందిస్తున్న వేణుగోపాల్

చెన్నూర్: చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలు పడి విద్యాభ్యాసం చేశాడు. తండ్రి మురికి దాసయ్య ఆరోగ్యం బాగాలేకపోవడంతో తల్లి కష్టపడి చదివించింది. తల్లి కష్టాన్ని వృథా చేయకుండా ఉన్నత చదువులు చదివి నేడు అమెరికాలో స్థిరపడ్డాడు. అయినా ఉన్న ఊరు, పడిన కష్టాన్ని మరిపోలేదు. వేణుగోపాల్ నిరుపేదల కష్టాలను గుర్తించి తొచిన సహాయాన్ని అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గత ఏడాది మంచిర్యాల పట్టణానికి చెందిన 50మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఇటీవల చెన్నూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్న 25మంది పేద విద్యార్థులకు రూ.1.65లక్షలతో సైకిళ్లను అందజేసి ఉదారతను చాటుకున్నాడు.

మరిన్ని సేవా కార్యక్రమాలు..



రానున్న రోజుల్లో మరిని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తా. పేదలకు నా వంతు కొంత సాయం అందిస్తా. మా తల్లి సుశీలతో పాటు కుటుంబ సభ్యులు ప్రోత్సాహం ఉంది. ప్రతి ఏటా కొంత మంది నిరుపేదలకు తన వంతు సహాయాన్ని అందిస్తా. ముఖ్యంగా చదువుకు ప్రాధాన్యతనిస్తా.

–మురికి వేణుగోపాల్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

పిల్లలు చదువు కోసం..


ఎన్నారై హరీశ్ రెడ్డి


ఆనంద్‌రెడ్డి ద్వారా వలంటీర్‌కు వేతనం అందిస్తూ..

తాంసి: తాంసి మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన ఆనంద్‌రెడ్డి జ్యోతి దంపతుల కుమారుడు హరీష్‌రెడ్డి స్థానిక పాఠశాలలో 9వ తరగతి వరకు చదువుకున్నాడు. 2016లో ఉద్యోగ రీత్యా అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. తనవంతుగా గ్రామానికి సాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. తన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల కోసం హరీష్ రెడ్డి గ్రామంలో డిగ్రీ పూర్తిచేసుకున్న యువతిని పాఠాలు బోధించడానికి నియమించాడు. సదరు యువతికి నెలకు రూ.5వేలు జీతంగా పంపిస్తున్నాడు.

మాతృభూమిపై ప్రేమతో..


జనార్దన్


స్వగ్రామంలోని ప్రభుత్వపాఠశాలలో సేవాకార్యక్రమాల్లో జనార్దన్

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్‌కు చెందిన పన్నెల జనార్దన్ అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డాడు. తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసే దిశలో ప్రారంభమైన గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ(గేట్స్)లో సభ్యుడిస్థాయి నుంచి అధ్యక్షుడిగా ఎదిగారు. 2012లో ఓ గాయకుడిగా సంస్థకు పరిచయమై సంస్థలో జరుగుతున్న ప్రతీ కార్యక్రమంలో తన వంతు సేవలను దశాబ్దానికి పైగా అందిస్తున్నారు. 2022లో ఉపాధ్యక్షుడిగా రాణించి సంస్థకు చేసిన సేవలను గుర్తించి 2023లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అలాగే నిర్మల్ జిల్లా కేంద్రంలోని కొండాపూర్‌లో మానసిక వికలాంగుల కోసం సేవా కేంద్రాన్ని ప్రారంభించాడు. ప్రస్తుతం అమెరికాలో రిహబులిటేషన్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నాడు.

గల్ఫ్ కార్మికులకు చేయూత


దుబాయిలో రసమయికి గల్ఫ్ కార్మికుల సమస్యలు విన్నవిస్తున్న కృష్ణ (ఫైల్)

ఖానాపూర్: గల్ఫ్ దేశాల్లోని తెలంగాణ కార్మికులైన ప్రవాసభారతీయుల సంక్షేమం కోసం గత పదేళ్లుగా మస్కాపూర్ నివాసి ఎన్ఆర్ఐ దొనికెని కృష్ణ కృషి చేస్తున్నాడు. గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న కార్మికులను స్వదేశాలకు పంపిస్తూ సహకారం అందిస్తున్నాడు. అనివార్య కారణాలతో గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి మృతదేహాలను కుటుంబాలకు చేర్చుతున్నాడు. ఇందుకోసం గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక సంస్థ స్థాపించి దేశవిదేశాల్లో కమిటీలను ఏర్పాటు చేశాడు. ఎన్ఆర్ఐ పాలసీ సాధన కోసం కార్మికులను చైతన్యం చేస్తున్నాడు. ప్రవాస భారతీయులకు కష్టాలు వస్తే ఇండియన్ ఎంబసీకి వెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నాడు. అక్రమ కేసుల్లో ఇరుక్కున్న వారి కోసం న్యాయపోరాటాలు చేసి పలు సందర్భాల్లో సఫలీకృతుడయ్యాడు.

ఎన్ఆర్ఐ పాలసీ సాధనే లక్ష్యం




ఎన్ఆర్ఐ పాలసీ సాధన కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చుకోవాలి. లేకపోతే గల్ఫ్‌కార్మికుల పక్షాన తమ సంఘం ఆధ్వర్యంలో గల్ఫ్‌దేశాలతో పాటు స్వదేశంలోనూ ఆందోళనలు చేపడుతాం.

– దొనికెని కృష్ణ, గల్ఫ్‌కార్మికుల అవగాహన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు

బంజారా దీక్షభూమికి ఆధ్యాత్మిక శోభ

- నేటి నుంచి మూడురోజుల పాటు జాతర
- 11న దీక్షా దివస్
- వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న లంబాడాలు


ధర్మ గురువు రామారావు మహారాజ్ విగ్రహం


ప్రేంసింగ్ దీక్ష చేపట్టిన శంకర్‌లొద్ది ప్రాంతం

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలో ఉన్న జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఇందులో భాగంగా దీక్ష భూమి వద్ద కొలువు దీరిన జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మ గురువు రామారావ్ మహారాజ్ మందిరాలను ముస్తాబు చేశారు. దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహారాజ్ అధ్యక్షతన ఏటా జనవరి 11న గురుకృపా దినోత్సవం (దీక్షాదివస్) నిర్వహిస్తున్నారు. లంబాడీల కులదైవమైన జగదాంబ దేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మగురువు శ్రీ రామారావ్ మహారాజ్‌లకు బుధవారం ఉదయం 11గంటలకు ప్రత్యేక పూజ, బోగ్ బండారో చేస్తారు. ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తదితర రాష్ట్రాల నుంచి లంబాడీ(బంజారా) భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు. నేటి నుంచి మూడురోజుల పాటు జాతర కొనసాగనుంది.

దీక్ష భూమి ఉద్దేశం
నార్నూర్ మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామానికి చెందిన ప్రేంసింగ్ మహారాజ్‌కు ఒకరోజు శివుడు కలలో ప్రత్యక్షమై కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని శంకర్‌లొద్ది వద్ద తపస్సు చేయమని ఆజ్ఞాపించాడు. దీంతో అతను 1978లో దీక్షకు పూనుకున్నాడు. విషయం తెలుసుకున్న మహారాష్ట్రలోని పొరదేవి నుంచి ధర్మగురువు రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ రామారావ్ 1979 జనవరి 11న ప్రేంసింగ్ వద్దకు వెళ్లి నీవు దీక్ష ఎందుకు చేస్తున్నావు? నీకోరిక ఏమిటని అడగగా విషయం చెప్పాడు. దీంతో అతని భక్తికి మెచ్చిన రామారావ్ మహారాజ్ శిష్యునిగా స్వీకరించాడు. అప్పటి నుంచి ఏటా జనవరి 11న గురుకృపా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


లక్ష్మణ్ (ఫైల్)

కడెం: ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి తన్నీరు లక్ష్మణ్(38) గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించాడు. మద్యానికి బానిసై విధులకు గైర్హాజరవడంతో తొలగించారు. అప్పటి నుంచి ఏ పనిచేయకుండా జులాయిగా తిరిగేవాడు. మద్యం మత్తులో ఉండేవాడు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


గాయాలపాలైన లక్ష్మణ్‌గౌడ్

భైంసాటౌన్: పట్టణ శివారులోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రగాయాలపాలయ్యారు. లోకేశ్వరం మండలంలోని పుస్పూర్‌కు చెందిన లక్ష్మణ్‌గౌడ్ ఆదివారం భైంసాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యానికి హాజరై తిరిగి ప్రధాన రోడ్డుపైకి నడుచుకుంటూ వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మణ్‌గౌడ్‌కు తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారమివ్వగా, చేరుకున్న సిబ్బంది ఏరియాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

గీతాముఖర్జీ ఆశయాలు సాధించాలి


పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నళినిరెడ్డి

ఎదులాపురం: గీతాముఖర్జీ బాటలో పయనించి ఆమె ఆశయాలు సాధించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం గీతాముఖర్జీ 99వ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నళినిరెడ్డి మాట్లాడుతూ మహిళల హక్కుల సాధనకు ఎంతో కృషి చేశారన్నారు. ఆరుసార్లు ఎంపీగా గెలిచిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఇందులో సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగజాతర


రామానంద్, మాదవ్‌రావ్ మహారాజ్‌ల ఆలయాలు

జైనథ్: మండలంలోని డొల్లార సమీపంలో గంగానది తీరంలో వెలిసిన రామానంద్, మాదవ్‌రావ్ మహారాజ్‌ల జాతర సోమవారం ప్రారంభం కానుంది. మహారాష్ట్రలోని పాటన్ బోరి నుంచి శోభాయాత్రగా విచ్చేసిన రథం నదితీరంలో ప్రతిష్ఠించిన తర్వాత నుంచి ఐదురోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

జాతర నేపథ్యం..
1889 నుంచి కొనసాగుతున్న ఈ జాతర ప్రస్తుతం 134 వసంతాలు పూర్తి చేసుకుంది. ఇక్కడి నదిలో స్నానం చేసి అమ్మవారికి తీర్థప్రసాదాలు సమర్పిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రతీతి. మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా పాటన్ –బోరిలోని స్వామి రామానంద్, మాదవ్‌రావ్ సంస్థన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా జనవరిలో నిర్వహించే జాతరకు ఆదిలాబాద్ జిల్లా నుంచే కాక మహారాష్ట్ర నుంచి వేలాది భక్తులు తరలివస్తుంటారు. అమ్మవారికి పూజలతోపాటు నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం నది ఒడ్డున ఉన్న రామానంద్, మాదవ్‌రావ్ మహారాజ్ విగ్రహాలకు పూజలు చేస్తారు.

ఘనంగా రథయాత్ర
సోమవారం రథోత్సవం నిర్వహించేందుకు వీలుగా మహారాష్ట్రలోని రామానంద్, మాదవ్‌రావ్ సంస్థన్‌లోని రామానందస్వామి పాదుకలను సంస్థాన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తులు పాదయాత్రగా గంగానదికి తీసుకువస్తారు. భక్తుల దర్శనార్థం నదిఒడ్డున ఆలయంలో, సాయంత్రం రథంలో ప్రతిష్ఠించి, శోభాయాత్ర నిర్వహిస్తారు. అనంతరం వారి కోసం దహిహండీ కాలా నిర్వహించి, ప్రసాద వితరణ చేస్తారు. ఐదు రోజులపాటు గంగామాత పూజ, ఆర్తీ, గణపతి అభిషేకం పూజ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పూసాయికి పోటెత్తిన భక్తజనం


భక్తులతో కిక్కిరిసిన ఎల్లమ్మ ఆలయం

జైనథ్: మండలంలోని పూసాయి ఎల్లమ్మతల్లి జాతరకు భక్తజనం పోటెత్తారు. జాతర మూడవ ఆదివారం వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జైనథ్‌తోపాటు, బేల, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ మండలాలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచే కాక మహారాష్ట్రలోని పాండర్‌కొడ, యవత్‌మాల్, బోరి నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రతిఏటా పుష్యమాసంలో నెల రోజులపాటు ఇక్కడ జాతర నిర్వహిస్తారు. ముందుగా ఆలయం ఎదుట ఉన్న నీటి ఊటలో స్నానాలచరించారు. ఎల్లమ్మ గర్భగుడి నుంచి వచ్చే జలధార కోనేరులో స్నానాలు చేస్తే వివిధ చర్మ రోగాలతోపాటు, వ్యాధులు నయం అవుతాయని భక్తుల విశ్వాసం. జాతర సందర్భంగా భారీగా దుకాణాలు వెలిశాయి.


మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


రావుడ్ దేవత వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

'అమ్మ' దర్శనానికి బారులు

తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దులోని కెరమెరి మండలం మహరాజ్‌గూడ గ్రామ సమీపంలో కొలువుదీరిన జంగుబాయి క్షేత్రంలో ఆధ్యాత్మికత శోభ సంతరించుకుంది. ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణలోని ఆదివాసీలే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో అమ్మవారిక్షేత్రం జనసంద్రంగా మారింది. అలాగే నానాటికి భక్తులు సంఖ్య పెరుగుతోంది. కరోనా మహమ్మారి కారణంగా 2019, 2021లో ప్రభుత్వం జాతరలకు అనుమతి ఇవ్వలేదు. ఈసారి అలాంటి ఇబ్బందులు లేకపోవడంతో రెండేళ్ల తర్వాత భక్తులు తమతమ ఆచార వ్యవహారాలతో జంగుబాయిని దర్శించుకునేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పటి వరకు 172 మేళం, లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈసారి తాత్కాలిక సౌకర్యాలు కూడా ప్రభుత్వం కల్పించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ జాతర నెల 21 వరకు కొనసాగనుంది.

– కెరమెరి(ఆసిఫాబాద్)